**కథ**

**ఆ నెలలో ట్రెజరీ ఆఫీసుకి జగన్నాధం మాస్టారు రావడం అది మూడోసారి!**

**సరాసరి డీలింగ్ అసిస్టెంటు బల్ల దగ్గరకి చేరారు. మాస్టారిని చూసి కూడా తన పనిలో ములిగిపోయాడు అతడు.**

**"నా పని అయిందా, బాబూ?" కొంతసేపు నిలబడ్డాక మాస్టారే అడిగారు.**

"నా పని అయిందా అంటే ఎలా తెలుస్తుంది? మీలాంటివాళ్లు రోజుకి పాతికమంది వస్తూంటారు! ఎందరిని గుర్తుపెట్టుకోగలను" కసురుకున్నాడు అసిస్టెంటు.

"నా పేరు జగన్నాధం. చాలాసార్లు వచ్చాను. అదే... రివైజ్డ్ పెన్షన్... ఎరియర్స్ నిమిత్తం."

"ఓహో! ఎలా!? మీ పనింకా అవ్వలేదండీ. చాలా పనులున్నాయి. సెక్షన్‌లో నేనొక్కడినే వున్నాను. మీ ఎరియర్స్ స్టేట్‌మెంట్ తయారుచేయడానికి కాస్త వ్యవధి కావాలి.

# ధర్మో రక్షతి రక్షితః

మీరు తొందరపడితే ఎలా? స్టేట్‌మెంట్ తయారయ్యాక నేను ప్యూన్ చేత కబురుపెడతానన్నాగా!"

"మీరన్నారనుకోండి. కాని పదిరోజులు దాటింది. మీదగ్గర నుండి కబురు రాలేదు. అందువలన మళ్లా నేనే వచ్చాను."

"పదిరోజులైనా పట్టవచ్చు. పాతిక రోజులైనా పట్టవచ్చు. నా కబురు అందిన తర్వాతనే రండి. ఇలా ఎప్పుడు పడితే అప్పుడు వచ్చేస్తూ నా పనులు చెడగొట్టకండి."

"ఇది కూడా మీ పనే కదా బాబూ. అవసరం వుండడం వలన వచ్చాను."

"అవునండీ. డబ్బు ఎవరికి అవుసరం లేదు? అందరికీ అవుసరమే! కాస్త ఓర్పు వహించండి. మీరిలా బుద్ధి పుట్టినప్పుడల్లా వచ్చేయకండి. నా కబురందాకనే రండి."

"దాహం వేస్తే నీటి దగ్గరకి మనం వెళ్లాలిగాని నీరు మన దగ్గరకి రాదుగా" సౌమ్యంగానే అన్నారు మాస్టారు.

తోక తొక్కిన కోతిలా లేచాడు అసిస్టెంటు!

"ఈ నీరూ-దాహం వేదాంతం నాకు అనవసరం. ఇప్పుడు నేను చెయ్యలేనండీ. సెక్షన్‌లోకి మరో వ్యక్తి వచ్చాకనే మీ పని జరుగుతుంది. ఇక నన్ను విడిచిపెట్టండి" కటువుగా అన్నాడు.

"సెక్షన్‌లోకి మరో వ్యక్తి ఎప్పుడు వస్తాడు?" అమాయకంగా అడిగారు మాస్టారు.

"ఆ విషయం కలక్టరుగారిని అడగండి" ఇక నీతో మాట్లాడే పనిలేదు అన్నట్టుగా సీటులోంచి లేచి వరండాలోకి నడిచి సిగరెట్ ముట్టించుకున్నాడు అసిస్టెంట్.

ఆఫీస్ నుండి బయటకొస్తూంటే ప్యూన్ వెంకటస్వామి ఎదురై, "మాస్టారూ, ఆ పది పర్సెంట్ వాటా అతడికివ్వకపోతే మీకు ఆ ఎరియర్స్ దొరకవు. అతడి వాటా ఇచ్చేస్తానని చెప్పండి. రేపంటే రేపు మీ సొమ్ము మీ చేతుల్లో వుంటుంది!" అసలు విషయం బయటపెట్టేడు.

"ఆ పని నేను చెయ్యలేను, వెంకటస్వామీ" అని తల వంచుకుని వెళ్లిపోతున్న మాస్టారిని జాలిగా చూస్తూ వుండిపోయాడు వెంకటస్వామి.

* * *

ప్రతీ నెలలో చివరి సోమవారం ఆ జిల్లా కలెక్టరేట్‌లో 'పబ్లిక్ గ్రీవెన్సెస్ డే'- అంటే, ప్రజల అర్జీలు స్వీకరించి సత్వర పరిష్కారం చేకూర్చే దినం! జిల్లా కలెక్టర్‌తోసహా ఇతర జిల్లా అధికార్లందరూ తప్పనిసరిగా హెడ్ క్వార్టర్స్‌లో వుండి తీరాలి! ఆరోజు తమ తమ అర్జీలను సంబంధిత ముఖ్య అధికార్లకు ప్రజలు అందజేసుకోవచ్చు.

కలెక్టర్‌గారి ఛాంబర్లోకి తన వినతి పత్రాన్ని పంపించి లోపలనుండి వచ్చే పిలుపు కోసం వేచి వున్నారు మాస్టారు. ఒక గంట అనంతరం మాస్టారికి పిలుపు వచ్చింది.

లోపలికి చేరి కలెక్టరుగారికి వినమ్రంగా నమస్కరించారు మాస్టారు. ఛాంబర్‌లో కలెక్టరుగారూ, ఆయనకెదురుగా నోట్‌బుక్కూ, పెన్సిలూ పట్టుకుని పి.ఏ కూర్చుని వున్నాడు.

మాస్టారిని ఒకసారి నిశితంగా పరికించి ఎదురు కుర్చీలో కూర్చోమన్నారు కలెక్టరుగారు. మాస్టారి వినతి పత్రాన్ని పూర్తిగా చదివిన తర్వాత, "ట్రెజరీ ఆఫీసుకి మీ రివైజ్డ్ పెన్షనార్డరు చేరి ఎన్నాళ్లైంది, మాస్టారూ?" అన్నారు.

"సుమారు రెణ్ణెళ్లైందండీ" అన్నారు మాస్టారు.

మాస్టారికి వయసు డెబ్భై దాటింది కాని సన్నగిల్లిన శరీరం, ముఖంలోని ముడుతలూ- 'కాదు, ఎనభై దాటుంటుంది' అంటూ పోట్లాటకొస్తున్నాయి.

"మీ పని త్వరగా అయ్యేలా చూస్తాను. మీరు వెళ్లండి" అన్నారు కలెక్టరుగారు.

ఆయన్నొకసారి కృతజ్ఞతాపూర్వకంగా చూసి వెనుదిరిగారు మాస్టారు. ఆయన బ్రతకలేక అయిన బడిపంతులు కాదు! ఎందరి బ్రతుకుల్నో తీర్చిదిద్దిన మహానుభావుడు!!

బస్ కోసం ఎదురుచూస్తూ గత స్మృతులలోకి జారేరు మాస్టారు.

* * *

ఈ హైస్కూల్లో ఎనిమిదో తరగతికి క్లాస్ టీచరుగా వుండేవారు జగన్నాధం మాస్టారు. అపర గాంధేయవాదీ, ముక్కుసూటిగా పోయే మనస్తత్వం కలవారూ కావడం వలన తోటి ఉపాధ్యాయులకే కాక ప్రధానోపాధ్యాయునికి కూడా జగన్నాధం మాస్టారంటే అమితమైన గౌరవం. ఇక విద్యార్థులకు ఆయనంటే హడల్!

ఆరోజుల్లో డిటెన్షన్ సిస్టమ్ వుండేది. ప్రతీ తరగతీ పాసవుతేనే పై తరగతికి ప్రమోషన్ వచ్చేది.

ఓరోజు స్టాఫ్ రూంలో మాస్టారు ఏదో పుస్తకం చదువుతూ కూర్చుని వుండగా హెడ్ మాస్టారి దగ్గరనుండి పిలుపు వచ్చింది.

"కూర్చోండి మాస్టారూ" అని తన చేతిలో వున్న పేపర్లను దొంతి చేసి పక్కన పెట్టారు హెడ్ మాస్టారు.

ఆయనకెదురుగా కూర్చున్నారు జగన్నాధం మాస్టారు. కొన్ని నిముషాలు మౌనం వహించారు హెడ్ మాస్టారు బల్లమీదున్న పేపర్లు సర్దుతూ. మనసులోని మాట వెల్లడించడానికి ఇబ్బందికరంగా వున్నప్పుడు అసంకల్పితంగా చేతులు ఏదో పని చేస్తూంటాయి. దీనినే ఆంగ్లంలో 'ఫిజెటింగ్' అంటారు. హెడ్ మాస్టారు అదే అవస్థలో పడ్డారు. ఆయన తనతో ఏదో విషయం చెప్పడానికి సందేహిస్తున్నారని జగన్నాధం మాస్టారు గమనించకపోలేదు. "మాస్టారూ, సబ్ కలెక్టరుగారబ్బాయిని ఫెయిల్ చేసారుట! బాగోదేమో ఆలోచించారా?" అన్నారు హెడ్ మాస్టారుగారు కాస్త మొహమాటపడుతూ.

"ఆ అబ్బాయికి లెక్కల్లో తక్కువ మార్కులు వచ్చాయి మాస్టారూ. మరి ఫెయిల్ చెయ్యక తప్పలేదు" అన్నారు జగన్నాధం మాస్టారు.

"ఆ పేపరు మరొక్కసారి దిద్దగలరేమో ప్రయత్నించకూడదూ!" హెడ్ మాస్టారి అభ్యర్ధన! 'మరికొన్ని మార్కులు వేసి పాస్ చెయ్యకూడదూ!' అనడానికి బదులుగా అన్న మాటలవి.

"లాభం లేదు మాస్టారూ. ఎన్నిసార్లు దిద్దినా అవే మార్కులు వస్తాయి. అయినాసరే, మీరు చెప్తున్నారు కనుక నా పొరపాటేమైనా వుందేమో చూసుకుంటాను" అన్నారు జగన్నాధం మాస్టారు.

ఆరోజుల్లో తాసిల్దారంటేనే జనం గడగడలాడేవారు. ఇక సబ్ కలెక్టరంటే మాటలా? కలెక్టర్‌గారబ్బాయి ఎనిమిదో తరగతి పాస్ కాకపోవడం ఆ స్కూల్లోనే కాదు ఆ ఊళ్లోనే పెద్ద సంచలనం కలిగించింది. ఏదో మారుమూల గ్రామానికి మాస్టారి బదిలీ ఖాయమనుకున్నారంతా. జగన్నాధం మాస్టారు మాత్రం మామూలుగానే వున్నారు. ఆయన నిబ్బరానికి తోటి ఉపాధ్యాయులే కాకుండా హెడ్


మాస్టారు కూడా ఆశ్చర్యపోయారు.

ఒక ఆదివారం ఉదయం మాస్టారింటికి కలెక్టర్‌గారి జీపొచ్చింది. సబ్ కలెక్టరుగారు అర్జంటుగా రమ్మన్నారంటూ బిళ్లబంట్రోతు వచ్చాడు. జరగబోయే తతంగం ఊహించుకున్నారు మాస్టారు. అయినా నిబ్బరంగా కలెక్టర్‌గారి బంగళా చేరుకున్నారు.

అక్కడ చోటు చేసుకున్న సంఘటన మాస్టారు ఊహించనిదీ, జీవితంలో మరచిపోలేనిదీ!

సబ్ కలెక్టరుగారు సాదరంగా ఎదురొచ్చి మాస్టారితో కరచాలనం చేసి మాస్టారు చేసిన పనిని మనఃస్ఫూర్తిగా అభినందించడం మాస్టారు ఎన్నడూ మరువలేనిది.

"తప్పుని 'తప్పు' అని సంకోచించకుండా చెప్పేవారంటే నాకు చాలా ఇష్టం. హెడ్ మాస్టారి ద్వారా అంతా విన్నాను. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తి మొహమాటాలకూ, బలహీనతలకూ అతీతంగా వుండాలి. అలా వున్నప్పుడే ఉపాధ్యాయుల పట్ల గౌరవభావం ప్రజల్లో ఎల్లకాలమూ నిలుస్తుంది. మీలాంటి ఉపాధ్యాయులున్న బడిలో మావాడు చదువుతున్నందుకు నేను గర్వపడుతున్నాను. వాడు తప్పినందుకు నాకెటువంటి విచారమూ లేదు" అన్నారాయన.



ఆయన ఔదార్యానికి చలించిపోయారు మాస్టారు. మనసులోనే జోహార్లర్పించారు ఆయనకి.

"మీ అబ్బాయి పరీక్ష తప్పడం విచారకరం. బడిలో ఉద్యోగం చేస్తూ ఇంటి దగ్గర విద్యార్థులకు పాఠాలు చెప్పడం నా స్వభావానికి విరుద్ధం. అయినా, మీ ఔదార్యానికి సంతోషపడి చెప్తున్నాను- ఈ సంవత్సరమంతా మీ అబ్బాయిని రెండు పూటలూ మా ఇంటికి పంపండి. వచ్చే వార్షిక పరీక్షలో మంచి మార్కులతో అతడు ఉత్తీర్ణుడయ్యేలా చేస్తాను. దయచేసి నా ఈ సహకారానికి మాత్రం వెల కట్టకండి" అన్నారు మాస్టారు.

భక్తిభావంతో మాస్టారిని చూశారు కలెక్టరుగారు.నాటి కలెక్టర్‌గారబ్బాయి నేడు జిల్లా కలెక్టర్ హోదాలో తన అర్జీ పరిశీలించి సానుకూలంగా స్పందించడం మాస్టారు గర్వపడ్డారు. అతడు తనని గుర్తించకపోవడం శారీరకంగా తనలో వచ్చిన మార్పు వలననే అనుకున్నారుగాని అతడు గుర్తించనందుకు మథనపడలేదు.

ఇంతలో తానెక్కవలసిన బస్ రావడంతో వాస్తవంలోకొచ్చారు.

★ ★ ★

ఆరోజు వీధి తలుపు చప్పుడైతే తలుపు తెరచిన మాస్టారు ఎదురుగా జిల్లా కలెక్టర్ హోదాలో తన పూర్వ విద్యార్థి నిలబడి వుండడం చూసి ఆశ్చర్యపోయారు.

వెంటనే తేరుకుని, "రా, బాబూ" అని సాదరంగా ఆహ్వానించారు.

"నా క్రింది స్థాయి ఉద్యోగి మీపట్ల ప్రదర్శించిన నిర్లక్ష్య వైఖరిని నా వైఫల్యంగా భావించి సిగ్గుపడి మొహం చాటు చేసుకున్నాను మాస్టారూ, మొన్న మీరు నా కార్యాలయానికి వచ్చినప్పుడు. అందుకే మిమ్మల్ని గుర్తించనట్టు ప్రవర్తించాను. మీ పూర్వ విద్యార్థిగా గుర్తించి క్షమించమని వేడుకోడానికి వచ్చాను ఈరోజు" అంటూ పాదాభివందనం చేస్తున్న అతనిని లేవదీసి అక్కున చేర్చుకున్నారు మాస్టారు.

"మీకు కలిగించిన శ్రమకు ప్రాయశ్చిత్తంగా మీకు రావలసిన సొమ్ము మీ సమక్షానికే తెచ్చాం. ఈ పేపర్ల మీద సంతకం చేసి స్వీకరించండి మాస్టారూ" అంటున్న అతనిని చెమర్చిన కళ్లతో చూస్తూ వుండిపోయారు మాస్టారు.

"నాడు పరిచయం కలిగిన మీ నాన్నగార్ని నీలో దర్శించుకుంటున్నాను బాబూ" అన్నారు మాస్టారు కండువాతో కళ్లు తుడుచుకుంటూ.

**ఎమ్మెస్వీ గంగరాజు**